


అంతలో వరసగా రెండు బస్సులు రాణీ గంజ్ వెళ్ళేవి వచ్చాయి.

'బతుకు జీవుడా' అనుకుంటూ బస్సు ఎక్కింది నళిని. కావాలని అదే బస్సు ఎక్కారు జగన్నాథం, మాధవరావూ.

రాణీగంజ్‌లో అందరూ దిగేసారు.

నళిని రిక్షా ఎక్కింది.

ఆమెకు వినిపించేలా "పాపం పాచిక పారలేదని నిరాశతో ఇల్లు చేరుకుంటోంది. పోనీ ఫాలో అవుదామా..." మాధవరావు రిక్షాలో వున్న ఆమెకేసి చూస్తూ అన్నాడు.

"వద్దులెండి. అసలే పొద్దుపోయింది. ఇంకోసారి చూద్దాం అంతగా అయితే" నాలుకతో పెదాలు తడుపుకుంటూ అన్నాడు జగన్నాథం.

రిక్షా వేగంగా వెళ్ళిపోయింది.

ఇద్దరూ పగలబడి నవ్వారు. దూరంగా వెళ్ళిపోతున్న నళినికి ఈ నవ్వు పిశాచాలు నవ్వినట్టు వినిపించింది.

"చూస్తూ జారవిడిచేస్తేమేమో మొత్తానికి చిక్కనిది. బంగరు బొమ్మలా వుంది కదూ..." మాధవరావుకు — సమాధానం ఇవ్వకుండా ఏదో ఆలోచిస్తూ ముందుకు నడుస్తున్నాడు జగన్నాథం. బహుశః మనసులో తను కూడా అదే అనుకుంటున్నట్టున్నాడు.

* * *

మర్నాడు సోమవారం.

జగన్నాథం, మాధవరావులతో బాటు ఆఫీసంతా చాలా హడావిడిగా వుంది.

ఆ రోజే కొత్త డైరెక్టర్ ట్రాన్స్‌ఫర్ మీద వచ్చి జాయిన్ అవుతున్నారు.

ప్రైవేటు డైరెక్టర్లు స్టాఫుకు తగిన హెచ్చరికలు ఇస్తూ ఖంగారు పడిపోతున్నారు.

అంతలో 'డైరెక్టర్‌గారు వస్తున్నారు' అంటూ కబురు అందించి తన సీట్లోకి వెళ్ళిపోయాడు చపరాసి.

కలకలం పుట్టుక్కున ఆగి ఆఫీసంతా అతి నిశ్శబ్దంగా వుంది. అందరి కళ్ళూ ద్వారం వైపే వున్నాయి.

ప్రైవేటే డైరెక్టర్లు పరుగులాంటి నడకతో ఎదురు వెళ్ళి కొత్త డైరెక్టర్‌గార్కి స్వాగతం పలికారు.

హాల్లో కాలు పెట్టిన కొత్త డైరెక్టర్‌గార్ని చూడగానే జగన్నాథమూ, మాధవరావు కొయ్యబారిపోయారు.

## మీ బిడ్డ సంతోషంగా ఉండాలంటే




# అమృతాంజన్ గ్రైప్ మిక్సచర్ ఇవ్వండి

OBM-2640 TG

బిడ్డ ఆపకుండా ఏడుస్తూ ఉంటే జీర్ణశక్తి బాగాలేదేమో! పాపకి అమృతాంజన్ లిమిటెడ్‌వారి గ్రైప్‌మిక్స్చర్ ఇవ్వండి. నులినొప్పి, వాయువు, అజీర్ణం పళ్లువచ్చే కాలంలో ఇబ్బందులు త్వరగా తగ్గిపోతాయి బిడ్డ ఇంకా సంతోషంగా ఉంటుంది

**అమృతాంజన్ లిమిటెడ్**



# మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు

1. 'దైవదర్శిని' :— ఇందు దైవాన్ని పొందిన వారు, జీవితం వృధా కాకుండా బాగుకి, బాధల విముక్తికి, వారి ప్రియ శిష్యులకు చెప్పిన అనేక దివ్య దైవ రహస్యాలున్నాయి. వెల రు. 10.00
2. 'రసికప్రియ కథలు' :— చదివిన కొలదీ చదవాలనిపించే మధురమైన 70 శృంగార కథలు. అవి గుర్తుకొచ్చినప్పుడల్లా ముసి ముసి నవ్వులు తెప్పిస్తాయి. వెల. రు. 5—00.
3. 'అద్భుత హాస్య కథలు' :— ఈ పుస్తకంలో బ్రహ్మాండంగా నవ్వు పుట్టించే చిన్నకథలు కొన్ని వందలున్నాయి. నవ్వి, నవ్వించటానికి ఉపయోగం. వెల. రు. 5—00.
4. 'చేతి పనులు' :— చిన్న పరిశ్రమలకు, సర్దాకి, సంపాదనకు మీ కిష్టమైన విన్నో రకాల సరుకులు సులభంగా ఇంట్లో తయారుచేసుకునే విధానాలు ఇందుగలవు. వెల. రు.5—00.
5. 'మంత్రశక్తి' :— మీ కోర్కెలు నెరవేర్చుకోటానికి వివిధ మంత్రాలు, వాటి అద్భుత రహస్యాలు, సాధనమార్గాలు ఈ పుస్తకంలో పేర్కొనబడినవి. వెల రు. 5—00.
6. 'జీవిత రహస్యాలు' :— మీ దాంపత్యజీవితాన్ని సంపూర్ణ ఆనందమయం చేసుకోవడానికి అనేక దివ్య కామసూత్రాలు ఇందు కలవు. మీరు చదువదగినది. వెల. రు. 5—00.
7. 'యువతి' :— స్త్రీలను గురించి యువతీ యువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహల విషయాలు గలవు. అందరూ చదువదగినది. వెల: రు. 5—00.
8. 'సంతానము' :— కామసుఖాలు అనుభవించుచు కూడా అవసరంలేనప్పుడు గర్భం రాకుండా అవలంబించదగు 60 సులభ మార్గాలు పేర్కొనబడినవి. వెల: రు. 5—00.
9. 'మీ స్వప్న ఫలాలు' :— 3 వేల స్వప్నఫలితాలు 12 వేల వివరాలతో డిక్షనరీలాగ ఇవ్వబడ్డాయి. గూఢార్థాలతో ఉండే మీస్వప్న ఫలాలను సులువుగా తెలుసుకోవచ్చు.వెల.రు.5.00
10. 'మానసిక శక్తులు' :— మీలోని ఆకర్షణశక్తి, ఆత్మశక్తి, దివ్యదృష్టి, మెస్మరిజం, హిప్నాటిజం, ఇంకా అనేక మహత్తరశక్తుల వివరాలు, వాటిసిద్ధికి సాధనరహస్యాలు ఉన్నాయి. రు.5.00

రచన: ఎ. ఎస్. మూర్తి, ఎం.ఏ. పోస్టు ఖర్చు ఒక పుస్తకానికి రు. 2.65, రెండు పుస్తకాలకు రు. 3.25 అదనం. ఏ మూడైనా లేక అంతకు మించి కొనేవారికి పోస్టుఖర్చులు ఉచితం,

**దేశ సేవ ప్రచురణలు, అశోకనగరు, ఏలూరు-2.**

(ఆంధ్ర)కు వ్రాస్తే మీకు కావలసి పుస్తకాలు వి. పి. పోస్టు ద్వారా పంపబడును.


## ఆమె ఎవరు?

నాలుకలు ఎండిపోయాయి. గుండెలు ఆగిపోయాయి ఇద్దరికి

దూరం నుండి నడిచి వస్తున్న కొత్త డైరక్టర్‌గారు నిన్న సాయంత్రం సనత్‌నగర్ బస్సు స్టాపులో తాము ఏడిపించిన 'నళినీదేవి గారే. అవును. ముమ్మాటికి ఆమే.

జుట్టు పైకి అందంగా చుట్టి ముడి వేసుకుంది. పక్కలో ఒకే ఒక సంపెంగపువ్వు తురుముకుంది. వంటి రంగులో కలిసిపోయే రంగు పట్టుచీర కట్టుకుంది. ఎంతో హుందాగా నడిచి వస్తున్న ఆమె వి గహం దగ్గరవుతున్నకొద్దీ ఇద్దరికీ తల తిరిగిపోతోంది.

బస్సుస్టాపు సంపెగపువ్వు. సహాయంకోసం అర్థిస్తున్న ఆమె కళ్ళు—బస్సు—ఎక్కిన రిక్షా గిరగిరా తిరిగిపోతున్నాయి. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. చీకటి ముసుకు వస్తోంది.

"ఈయన మాధవరావు. వీరు జగన్నాథం వీరు చలపతి ..." నమస్కరిస్తున్న చేతులు వారి అధీనంలో లేవు. చలిజ్వరం వచ్చిన వాళ్ళలా వణికి పోతున్నారు. డిప్యూటీ డైరక్టర్ రంగారావు ఆమెకు మిగతావారిని పరిచయం చేయడానికి ముందుకు కదిలాడు.

వెడుతూన్న నళినీదేవి వీరిద్దరినీ నిశితంగా గుండెల్లోకి సూటిగా చూసింది. తలలు వంచుకున్నారు. ముందుకు వెళ్ళిపోయింది నళినీదేవి.

బొమ్మల్లా నిల్చిపోయిన మాధవరావునూ జగన్నాథాన్ని కుదిపి ఈలోకంలోకి తెచ్చాడు—సెక్షన్ ఆఫీసర్ సుందర్రావు.

"ఏమిటి? కొత్త డైరక్టర్ గార్ని చూడగానే అలాఅయిపోయారేమిటి ? ఆ ఖంగారేమిటి?"

సుందరావుకు ఏం జవాబియ్యాలో తెలియని స్థితిలో వున్నారు —

"ఈ డైరెక్టర్‌గార్నిగురించి చాలా విన్నాం. చండశాసను రాలు అని, స్టాఫ్‌ను మూడు చెరువులనీళ్ళు తాగిస్తుందనీ విశాఖపట్నం స్టాఫ్ గోల పెట్టింది. అయితే ఒకటి — సిన్సియర్‌గా పనిచేసే వాళ్లకు ఎంతో గౌరవం ఇస్తుందిట. ఏమైనా వారి విషయంలో మనం జాగత్తగా వుండడం మంచిది" అంటూ వెళ్లిపోయారు సుందర్రావుగారు.

తే ఉన్నట్టుగానే పిడు[illegible] టి వార[illegible]

"మీ ఇద్దర్నీ డైరెక్టర్‌గారు రమ్మంటున్నారు" అని. యాంత్రికంగా లేచినిలబడ్డారు. గుండె దడదడ లాడుతోంది. ఆమే—ఇప్పటి కొత్త డైరెక్టర్ అని కలలో కూడ ఊహించలేదు.

నిన్న సాయంత్రం ఆమె అడగ్గానే మర్యాదగా ఆటోలో ఆమెను ఇంటివద్ద దించితే ఈకధ ఇంకోలా వుండేది. అప్పుడు ఆమె దృష్టిలో శాశ్వతంగా తమకో ప్రత్యేక స్థానం ఉండేది. ఇప్పుడో అలాంటి అదృష్టాన్ని చేజేతులా నాశనం చేసుకున్నాం' ఇద్దరి మనస్సులో ఆందోళన.

ఎలాగో ఆమెగదిలోకి వెళ్ళి టేబిల్ ముందు నుంచున్నారు అపరాధుల్లా.

ఆమె వారిని కూర్చోమనకుండా — అసలు వారికేసి కన్నెత్తి అయినా చూడకుండా ఏదో ఫైల్ సీరియస్‌గా చూస్తోంది.

ఓ పదినిమిషా లయింతర్వాత కళ్ళజోడు టేబిల్‌మీద పెట్టి ఇద్దరికేసీ అతి తీక్షణంగా చూసింది.

ఇద్దరికీ గుండెలు అరికాళ్ళలోకి వచ్చేశాయి.

ఎలాగో అతి కష్టంమీద—

"క్షమించండి" అని అనకలిగారు మాధవరావూ, జగన్నాధమ్మూ.

"మిమ్మల్ని క్షమించడమా. అసంభవం. మీలాంటివారు ఉన్నంతవరకూ ఈ సమాజం మారదు. సాటివ్యక్తి ఏ పరిస్థితిలో సహాయం కోరేరో అర్థంకానట్లు నటించి నీచాతి నీచంగా ప్రవర్తించారు." ఆమె కళ్ళు అగ్నిని కురిపిస్తున్నాయి.

ఆ చూపుకు తట్టుకోలేక తలలు భూమిలోకి దిగిపోయాయి.

"ఈ ఊరు నాకు కొత్త. ఒంటరిగా చీకట్లో అంతదూరం ఆటోలో వెళ్ళడానికి సంకోచించాను. పైకి పెద్ద మనుష్యుల్లా కనిపించబట్టి — పైగా మీలో సభ్యతా సంస్కారం ఉన్నాయని అపోహ పడబట్టి మిమ్మల్ని రిక్వెస్ట్ చేయగలిగాను. కాని మీరు ఇంత నీచులని కలలోకూడా ఊహించలేదు.."

"క్షమించండి మేడమ్. అసలు మేము ఎప్పుడూ అలా ప్రవర్తించలేదు. అసలు అటువంటి పరిస్థితి మాకు ఎప్పుడూ కలగలేదు.."

"ఓ! వచ్చిన ఒక్క పరిస్థితీ ఉపయోగించుకున్నారన్నమాట. ఒక స్త్రీ మీ సహాయం కోరినంత మాత్రాన మీలో రాక్షసత్వం చోటు చేసుకుంటుందా! నేను కాబట్టి అసహ్యించుకుని ఊరికే ఉండిపోయాను. అదే ఏ అమాయకురాలో అయితే ఈపాటికి ఆత్మహత్య చేసుకునేది. లేదా నడిబజారులో మీ పరువు తీసేది. చదువూ, హోదా వున్నాయి కాబట్టి మిమ్మల్ని బజారుపాలు చేయలేకపోయాను. అదృష్టమో దురదృష్టమో నా ఆఫీసులోనే దొరికిపోయారు. మీలాంటి చీడ పురుగులు ఈ ఆఫీసులో వుండకూడదు. అవినీతి, అసభ్య ప్రవర్తన కారణంగా మీ ఇద్దరినీ ఉద్యోగాల్లోంచి తొలగించబోతున్నా"

"మేడమ్...మేడమ్...ఈ సారికి క్ష..."

"వీల్లేదు. వెళ్ళండి. ఐ సే యూ గెటౌట్.."

"మాకు బాగా బుద్ధి వచ్చింది మేడమ్ ఇంకెప్పుడూ ఇలాంటి పొరబాటు చేయం. ఈ ఉద్యోగాలు పోతే మా కుటుంబాలు నడివీధిలో వుంటాయి" దీనంగా కన్నీరు కారుస్తూ జగన్నాధం అంటూంటే.

"అవును మేడమ్ మా జీవితంలో ఇలాంటిపని ఎన్నడూ చేయమని ప్రామిస్ చేస్తాం. ఈసారికి ఈ తప్పు కాయకపోతే మా కుటుంబాలు సర్వనాశనం అవుతాయి" ఏడుపు ఆపుకుంటూ మాధవరావు అన్నాడు.

"ఆల్‌రైట్ మీ మొహం చూసి కాకపోయినా మీ భార్య పిల్లల మొహం 'చూసి ఈసారికీ వదిలేస్తున్నా అసలు ఆఫీసులో వర్క్ ఆట్మో చేయలేకపోయినా ఓ సమయంలో సహిస్తానేమోగాని ఎవరిలోనైనా సభ్యత లోపించిందంటే సహించను. క్షమించను. తమతో సమానంగా పనిచేసే పురుషుల్ని సోదరులుగా భావిస్తోంది స్త్రీ. కాని స్త్రీని మాత్రం సోదరిగా భావించుకునే విశాలహృదయం, సంస్కారం మీకు లేకపోతోంది. అందరూ మీలాంటి వారు కాదు. కొందరైనా మంచివారుండబట్టే ఆడది కూడ ఉద్యోగాలు చేయగలుగుతోంది. ఏమైనా స్త్రీని స్త్రీగా గౌరవించే వరకూ మీలాంటి వాళ్ళకు నిష్కృతి లేదు..."

వంచిన తలలు ఎత్తలేదు ఇద్దరూ.

చటుక్కున కళ్ళజోడు పెట్టుకుని ఫైల్‌లోకి చూడ్డం మొదలు పెట్టింది నళినీదేవి.

ఉండాలో వెళ్ళిపోవాలో తెలియక తికమక పడ్డారు జగన్నాధం, మాధవరావు.

"ఊఁ వెళ్ళచ్చు..."

ఆమె అనడం తరువాయి ఇద్దరూ బయటకొచ్చి పడ్డారు.

మాధవరావు, జగన్నాధమ్మ మర్నాడే అందుకున్నారు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు. ఉద్యోగాలు తీసేయలేదుగాని చెరో మూలకూ విసిరేసినట్లుగా వేరే ఊళ్ళకు బదిలీచేసేసింది.

ఇద్దరి కళ్ళల్లో నీరు ఉబికింది. ఆ కన్నీటిలో చదువు పూర్తి కావలసిన తమ్ముడూ, పెళ్ళి కావలసిన చెల్లెలు, పూర్తిగాని కొత్త డాబా. దానిమీద గాలికి ఊగుతూన్నట్టున్న బోగస్ విల్లా పూలూ మెదిలి మసక బారాయి.

